# బండి

అక్కినేని కుటుంబరావు

**"ఇంక ఈ వూళ్లో ఏం వుంటారు? నా దగ్గరకు రమ్మని" అమ్మనీ, నాన్ననీ రాము ఎన్నిసార్లు పిలిచినా—**

**"ఇద్దరమూ వున్నంత కాలము ఇక్కడే! ఒకరు పోయాక రెండో వారిని తీసికెళ్లు" అనేవారు వాళ్లు.**

నాన్న పోయాడు.

అమ్మ మిగిలింది.

ఇల్లూ, ఆ కాస్త పొలం, పట్నంలో పట్టవనుకున్న సామాన్లూ... తాతలనాటి భోషాణం... అన్నీ... అన్నీ అమ్మేశాడు రాము.

నాన్న ప్రాణానికి ప్రాణమైన బండి మిగిలింది.

ఈ బండిని కూడా అమ్మేసి రేపే వెళ్లిపోవాలి.

"ఈ బండితో ఏమిటి మీ కింత అనుబంధం! ఇవ్వాళా రేపూ రక్తమాంసాలున్న మనుషులకే అభిమానాలూ అనుబంధాలూ కరువవుతున్నాయ్. చెక్కబండితో ఏమిటి? అయిన కాడికి అమ్మెయ్యక?" అంది శాంత.

"నీకేం తెల్సు. ఇది చెక్క బండా? నాతో ఎన్ని ఆటలాడింది. నన్నెంతెంత దూరాలు మోసింది. తిప్పింది. నాకెంత ఆనందాన్నిచ్చిందీ బండి. ఈ పిచ్చిముండ?" అన్నాడు రామూ.

"మరీ అంత యిదయితే ఎందుకూ పనికిరారు? బండేం చేసింది? మహా అయితే ఆ ఎడ్లేమన్నా... ..." అంది.

"అవును ఎడ్లు మాత్రం. అవి నాతో మాట్లాడేయి గదూ! నిజంగా ఎలా చూసేవి? అవి క్రీగంటి చూపులు చూసేవి. వాటి కళ్లల్లో ఆశ్చర్యం స్పష్టంగా కనపడేది. అవి నాతో ఎంత స్నేహం చేసేవి. అవి సైగలు చేసేవి. నన్ను మెల్లమెల్లగా కుమ్ముతూ నాతో ఆటలాడేవి. గతిలేక ఎడ్లని అమ్మేసినప్పుడు, నేను పది రోజులు మూసిన కన్ను తెరవలేదు. మామూలు అవ్వడానికి ఆర్నెల్లు పట్టింది. ఆ ఎడ్లు తమ స్వంత యిల్లు స్వంత బండి స్వంత నాగలి స్వంత మనుషులనుకున్న మా అందర్నీ వదలి వెళ్లాల్సి వచ్చినపుడు... ఎంత దిగులు పడ్డాయో. అవి మా కోసం ఎంత ఆరాటపడ్డాయో. ఆనాడు అవి పోయినా, నాన్న ఈ బండిని చూస్తూ ఈ బండి మీదే తన వార్ధక్యం అంతా గడిపాడు.

ఇవ్వాళ ఈ బండి నాతో మాట్లాడుతోంది శాంతా. నాతో మాట్లాడుతోంది. నిజం. నువ్వు నమ్మవు. కాని అది నా చిన్నతనాన్ని నా అల్లరిని, నా స్నేహితుల్ని వాళ్ల మాటల్ని నాకు వర్ణించి వర్ణించి చెప్తోంది.

నేను ప్రతి సంక్రాంతి పండక్కి దీన్ని కడిగి పసుపుతో రుద్ది కుంకుమతో బొట్లు పెట్టే వాడినని నాకు యిందాకటివరకూ గుర్తు లేదు. అది యింతకు ముందే నాకు గుర్తు చేసింది.

ఓసారి నేను బండి చివరి కెక్కి పడిపోబోతే ఈ బండే నన్ను పడకుండా అడ్డుకుంది. అప్పుడు నా చిన్న మిత్రులంతా చేరి ఈ బండిలాంటి బండి ఈ వూళ్లోనే కాదు ఓల్ మొత్తం ప్రపంచంలోనే లేదని ఖరారు చేశారు. ఆనాడు మేమంతా దీన్ని ఎంత పొగిడాం. అదంతా ఈ బండి నాకింతకు ముందే చెప్తోంది" అంటే.

"సర్లెండి. పిచ్చి కుదిరింది. రోకలి తలకి చుట్టండన్నట్టు పెద్దాయన ఏదో పిచ్చిలే అనుకునే వాళ్లం. మీరు తయారయ్యారన్న మాట" అంది శాంత నవ్వుతూ.

రామూకి ఆ బండి అంటే వల్లమాలిన యిష్టం.

అతని చిన్నతనంలో సగభాగం ఆ బండి మీదో బండి కిందో ఆటల్తో గడిచిపోయింది.

వేరే వాళ్లయితే వాళ్ల బళ్ల దగ్గరికి పిల్లల్ని చేరనిచ్చే వాళ్లు కాదు. పిల్లలు బండి మీదెక్కి దాని తొట్టిని తొక్కి తొక్కి పాడు చేస్తారనీ, బండి మీదున్న జల్లనో, గుడిసెనో నాశనం చేస్తారని వాళ్లభిప్రాయం.

రాము వాళ్ల నాన్నకి మాత్రం తన కొడుకు ఆటకి బాగుంటే ఆడుకోనియ్యి పాడయితే బాగు చేద్దాంలే అనుకునే తత్వం. అందువల్లే "నయ్య (రామూని మా అయ్య అని తప్ప మరో పేరుతో పిలిచి ఎరగడా తండ్రి) ఆడుకుంటే అదే శాన" అనేవాడు.

తోటి పిల్లల్తో ఎప్పుడూ ఏదో ఓ ఆట ఆడుతూనే వుండేవాడు. బండి మీదెక్కి పరుగులూ, దూకడాలూ, బండి కింద దాక్కుని వేరే వాళ్లని జడిపించడాలు. నవ్వులు, కేరింతల్తో ఆ బండి ఎప్పుడూ పకపకలాడ్తున్నట్టుండేది.

**ఇది ఉత్త చెక్క బండి కాదు. నాతో ఎన్ని ఆటలాడింది! నన్నెంతెంత దూరాలు మోసింది. ఓసారి నేను బండి చివరికి ఎక్కి పడబోతే తనే అడ్డుకుంది. ఆనాడు నా చిన్న మిత్రులంతా చేరి ఇలాంటి బండి ఓల్ మొత్తం ప్రపంచం లోనే లేదన్నారు. ఆ ఎడ్లు మాత్రం.. ఎంత స్నేహం చేసేవి!**

రామూకొక్కస్త వూహొచ్చిన తర్వాత అచ్చియ్య బాబాయి పెళ్లికి అదే బండి మీద పెదపారుపూడి కెళ్లడం గుర్తుంది. ఆ పెళ్లికెళ్లేటప్పుడు ఎన్ని సరదాలు. ఎంత సంబరం.

అన్ని బళ్లకంటే తమ బండే ముందుండాలని రామూ పట్టుబట్టాడు. రామూలాగే మిగిలిన పిల్లలూ వాళ్లెక్కిన బండే ముందుండాలని మారాం చేశారు.

"ఒరే అక్కివాడా! ఏంట్రా నీ గొప్ప! ముందుండాలంట ముందు. అరేయ్ ఈ అక్కివాడి బండిని అందరి బళ్ల కంటే ఎనకమాలుంచండి రా!" అన్నాడు చలపతి మామయ్య.

రామూకి ఏడుపు ముంచుకొచ్చేసింది. కోపంతో కళ్లు మందారపూలకన్నా ఎరుపెక్కాయి. ఉక్రోషంతో వూగిపోయాడు.

"అసలీ చలపతి మామెవడు? నన్ను అక్కివాడ అంటాడెందుకు? అక్కిని బొక్కిని బొళబొళ అని ఎప్పుడూ నన్ను నెత్తి మీద ఎందుక్కొడతాడు. ఈయన్నీ..." అని చర చరా బండి మీద నుంచి జారుతున్న రామూని "పడతావ్... పడతావ్" అని నవ్వుతూ హెచ్చరించింది అమ్మ.

"నీకసలు సిగ్గులేదా? నీ కొడుకుని ఎవరో ఏడిపిస్తుంటే నవ్వుతావెందుకు?" అని 'ఓ' అని ఏడవడం మొదలెట్టాడు రామూ.

ఇక ఆ ఏడుపుని ఆపించడాన్కి, వాడిని సముదాయించడానికీ, ఎంత మంది ఎన్నియాతనలు పడ్డారో, కన్నీళ్లొచ్చేలాగ ఎంత పడీ పడీ నవ్వారో.

ఆ బండి మాత్రం అన్ని బళ్లకన్నా ముందు ఆగమేఘాల మీద పెద పారుపూడి కేసి వురికింది. ఆ బండి లేపిన మట్టి మబ్బుల్లో వెనకవున్న బళ్లన్నీ మాయమైపోయినాయ్.


ఆ బండి అలా పరుగు పరుగున వెడుతోంటే ఆ చిట్టి రామూగాడు తాను వెళ్లేది పెళ్లికనీ, ఆ పెళ్లి పెదపారుపూడిలో అనీ మర్చిపోయాడు. అలా ఆ బండి అనంతంగా లోకాలన్నిటినీ తెంచుకుని ఆకాశంలో కెళ్లిపోతుందని గట్టిగా నమ్మాడు.


పెళ్లి వాళ్లు చెరువుగట్టు దగ్గర విడిది ఏర్పాటు చేసి, సానకాల కావిళ్లతో ఎదురొచ్చి, బళ్లన్నీ వచ్చి చెరువు గట్టు మీద ఆగేసరికి రామూ నిద్రమత్తులో వాళ్లమ్మ వళ్లోవూగుతున్నాడు.

రామూ వాళ్లమ్మకి సినిమా చూద్దామనిపించినప్పుడల్లా 'అబ్బాయి సినిమా కెళ్దామంటూ ఒకటే గొడవ పెద్తున్నాడు' అనేది.

ఆయాట వింటూనే "గొడవ దేనికీ వెళ్తే పోలా!" అనేవాడు నాన్న.

ఇకరామూ పనేమిటంటే చిన్నమ్మనీ, పెద్దమ్మనీ, అత్తనీ, అమ్మమ్మనీ, రాముడక్కాయినీ, రాగమ్మొదిన్నీ 'ఇవ్వాళ మా బండి మీద సినిమా కెళ్తన్నాం. మా అమ్మ నిన్ను కూడా తొందరగా తెమిలిరమ్మంది' అని పేరు పేరునా






అందర్నీ పోగెయ్యటం. ఎవరెవరికి రావటానికి కుదురుతుందో ఎవరెవరికి కుదరోదో, ఎన్నింటికి రావాలో ఎవరి కోసమూ చూడకుండా బండి అగమేగాల్తో ఎలా వెళ్లిపోతుందో చెప్తూ పొద్దున్నుంచి మధ్యాహ్నం దాకా వూపిరాడకుండా తిరిగేవాడు రాము. మధ్య మధ్యలో బండిని కొన్త శుభ్రం చేసి, బండి మీద గడ్డేసి, గడ్డి మీద చాపలు పరిచి, చాప మీద దుప్పట్లు పరిచి, అవి జారకుండా తాళ్లతో కట్టి బండికి గుడిసె ఎక్కించి తయారు చేస్తున్నారా లేదా పర్యవేక్షించడం. కనపడిన స్నేహితులందరికీ మేం మా బండి మీద గుడివాడ సినిమా కెళ్తన్నాం అని గొప్పలు చెప్పుకోవడం" నేను తొట్లోకూర్చుంటా! నేనే ఎడ్లని తోలతా" అనేవాడు.

"నీకు తోల్డంవచ్చేంటే" అనేవాడు కిష్న.

"అరే కిట్టిగా నీకు రాదురా. నా కొమ్ము. ఎట్టాగో చూపించనా?" అని గబగబా తొట్లో కెక్కి కూర్చునేవాడు. తొట్లో మునిగినట్టుండి కిష్న మొఖం కనపడేది గాదు. లేచి నిలబడి "ఇదుగో ఇట్లా" అని చేతిలో చెర్నకోల వున్నట్టుగా అటూ ఇటూ వూపుతూ "చల్ చల్" అనేవాడు.

కిష్నేమో "పోరా! నీకేం రాద్దు 'చల్ చల్లం'ట. 'చల్ చల్' 'చల్ చల్' అని గుర్రాల్ని తోల్తారు. ఎడ్లని 'జా. ఎహెహె! నిన్ను మాదిగి రాముడింటికి తోలా' అని చెర్నకోల పెట్టి కొట్టుడు కొట్టాలి..." అని మూతి బిగపట్టి ఎడ్లని కొట్టడానికి సర్వశక్తుల్నీ వినియోగించే వాడిలా అయిపోయాడు.

"ఏం కాదులే. మా ఎడ్లు గుర్రాల కన్నా బాగా పరుగు పెడతాయి. అసలు మా బండి ఎంత తేలికో తెలుసా? ఏడు మల్లె పూవులంత బరువు. మా నాన్న చెప్పాడు. మా ఎడ్లకి అసలు బరువే తెలవదు. అందుకే వాటిని మే మెప్పుడూ ఒక్క దెబ్బ కూడా ఎయ్యం. ఎడ్లని కొట్టగూడదు. అని నోరులేని జీవులు. వాటిని కొడితే పాపం."

"అవో! పాపమని వూరుకుంటే అవి మన్నే పొడుత్తయ్"

"మా ఎడ్లు పొడవ్వు"

కిష్నకి తెలుసు. రామూ వాళ్ల ఎడ్లు పొడవ్వు. వాటితో రామూతోపాటు తనూ ఆడుకున్నాడాయె.

"కొడితే పాపమేగాని తిట్టొచ్చు" అని రాజీకొచ్చాడు కిష్న.

"తిట్టగూడదు కూడా! మా నాన్న చెప్పాడు. తిడితే మన నోరు పడయి పోతుందంట."

"మరి నీకు చెర్నకోల ఎందుకురా!" అన్నాడు కిష్న. వాడికి మంచి పాయింటు దొరికింది.

"బండి తోలుకెళ్లేటప్పుడు అడ్డం రాకుండా బజార్లో వాళ్లని జడిపించడానికి" అన్నాడు రాము.

కిష్న మరింకేమీ మాట్లాడకుండా కాసేపుండి "నేను కూడా తొట్లో కూర్చుంటారా" అన్నాడు.

రామూ రమ్మని బండి తొట్లో స్నేహితుడ్ని కూడా కూర్చోపెట్టుకుని 'పుత్తిత్తి'గా ఎడ్లులేని బండిని చేతిలోలేని చెర్నకోలతో తోలడం మొదలెట్టాడు.

కాసేపు కూర్చున్నాక క్రిష్ణ "మీ బండి మంచిది రా" అన్నాడు.

"అవును మా బండి భలే మంచిది. మా చలపతి మామయ్య వాళ్ల బండుందే. అది దొంగ మొహంది. ఎవరూ ఎక్కకపోతే మాట్లాడకుండా నుంచుంటుంది. ఎవరన్నా ఎక్కారనుకో. ఇక అది ముళ్లల్లోకి, తుప్పల్లోకి తీసుకెళ్తంది. మొన్నొకసారి మా చలపతి మామయ్య తూరుప్పాలెం వెళ్తొంటే నేను కూడా ఎక్కా. అప్పుడిక అది బోదిలో కంటే బోదిలోకి వెళ్లిపోయి ఇక కొంచెం వుంటే బోల్తా కొట్టేదేనన్న మాట! నేను దిగిపోతాను అని ఏడిస్తే కూడా అది ఆగలా."

"మరి మీ చలపతి మామయ్య ఎట్టా ఏగుతున్నాడ్రా దాంతో."

"అదే నాకు తెలవదు. నేనడిగితే మా మామయ్యన్నాడు 'అక్కినాళ్లు ఎక్కితే వాళ్ల బండి పడేస్తుందంట' అన్నీ వట్టి మాటలే అసలా బండే దొంగమొహంది." ఏదో గుర్తొచ్చిన కృష్ణ "అవున్రా మీ చలపతి మామయ్యగారి బండి మొన్న మిల్లు దగ్గర్నుంచి వచ్చేప్పుడు బోల్తా కొట్టిందిరా. అప్పుడు నువ్వు లేవు గదా బండి మీద.

"అవును. నేను లేను, మా నాన్న కూడా లేడు. మేమిద్దరమేగా అక్కినాళ్లం. మా అమ్మ అక్కినాళ్లు కాదంట— తెలుసా?"

అంతలో వాళ్లమ్మ "చిన్నా" అని ఇంట్లో

